సాక్షి సంగారెడ్డి

శనివారం । 4 । నవంబర్ । 2023

I



అందోల్‌లో గెలుపెవరిది?
రాష్ట్ర రాజకీయాల్లో 'అందోల్' నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వివరాలు IIలో ▸



ఆ ఆరుగురి చుట్టే నర్సాపూర్
నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది. వివరాలు IIలో ▸



నిండు మనసుతో ఆశీర్వదించాలి
ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

ఎమ్మెల్యే వాహనం తనిఖీ



భూపాల్‌రెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి కారును శుక్రవారం పోలీసులు, ఎన్నికల టీం అధికారులు తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి మండల కేంద్రమైన నిజాంపేట్ మీదుగా నారాయణఖేడ్‌కు వాహనంలో బయలుదేరారు. నిజాంపేట్ శివారులోకి రాగానే పెద్దశంకరంపేట ఏఎస్ఐ సునీత, ఎన్నికల అధికారులు నిలిపి క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. హైదరాబాద్‌లో ఉన్న యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జంగి(కె) సర్పంచ్ రాజు పటేల్‌ను ఉదయం ఎమ్మెల్యే ఆస్పత్రిలో పరామర్శించారు. ఆయన వెంట తనయుడు రోషన్ రెడ్డి ఉన్నారు.

రాజకీయ పార్టీలూ... దివ్యాంగులను గుర్తుంచుకోండి



మాట్లాడుతున్న అడివయ్య

నారాయణఖేడ్: 'ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగుల సంక్షేమాన్ని రాజకీయ పార్టీలు మరిచాయి. రాష్ట్రంలో ఉన్న 43 లక్షల మంది సంక్షేమ పట్ల ఆయా పార్టీలకు చిత్తశుద్ధి లేదు' అని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య విమర్శించారు. పట్టణంలో ఉన్న ఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం నియోజకవర్గ కమిటీ సమావేశం జరిగింది. పింఛన్లు తప్ప ఏఅంశాలూ మేనిఫెస్టోల్లో లేవన్నారు.

ఏసీబీకి చిక్కిన టైపిస్ట్

రూ.4వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్

కోహీర్(జహీరాబాద్): ఏసీబీ అధికారులకు కోహీర్ తహసీల్దార్ కార్యాలయ టైపిస్ట్ పట్టుబడ్డాడు. శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న రైతు నుంచి రూ.4 వేల లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. మెదక్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ కథనం... మండలంలోని కవేలి గ్రామ వాసి గడ్డమీది రాజుకు చెందిన 69 సర్వేనంబర్‌లో ఉన్న ఎకరంన్నర పొలానికి డిజిటల్ సర్వే జరగకపోవడంతో రైతు బంధు ఆగిపోయింది. పథకం తిరిగి పొందాలంటే సరైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ అధికారులు సూచించారు. ఈ విషయం తెలుసుకొన్న కార్యాలయ టైపిస్ట్.. డాక్యుమెంట్లతోపాటు రూ.10వేలిస్తే పథకం వచ్చేలా చేస్తానని తెలిపాడు. రూ.4వేలు లంచం ఇచ్చేందుకు బాధితుడు ఒప్పందం చేసుకున్నాడు. ఈ విషయమై ఏసీబీ అధికారులను అతను ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం డబ్బులు తీసుకుని జహీరాబాద్ బస్టాండ్ వద్దకు రావాలని బాధితుడు తెలపగా రాజు వచ్చాడు. నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండ్‌గా అతడిని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఆ మేరకు విచారిస్తున్నారు.

శిక్షణకు ఏర్పాట్లు ముమ్మరం



శిక్షణ కేంద్రంలో ఎస్పీ రూపేష్

సంగారెడ్డి : జిల్లా పోలీసు శిక్షణ(డీటీసీ) కేంద్రాన్ని ఎస్పీ రూపేష్ శుక్రవారం సందర్శించారు. అక్కడి పరిసరాలను, గ్రౌండ్, బ్యారక్స్, క్లాస్ రూమ్స్, భోజనశాల ఏ విధంగా ఉన్నాయో పరిశీలించారు. రానున్న కొత్త బ్యాచ్ ట్రైనింగ్‌కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ఉండాలన్నారు. ఏ క్షణంలో అయిన ట్రైనింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. డీటీసీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సిబ్బందిని సూచించారు. ఆయన వెంట డీటీసీ ప్రిన్సిపాల్ అదనపు ఎస్పీ. రాములు నాయక్, అసిస్టెంట్ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ ఆర్ఐ హన్మిరెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తెలంగాణ ద్రోహి జగ్గారెడ్డి

- అడ్రస్ ఉండని అతను కావాలా? అందుబాటులో ఉండే చింతన్న కావాలా?
- ప్రభాకర్ గెలుపు మీ బాధ్యత.. సంగారెడ్డి అభివృద్ధి నా బాధ్యత
- మంత్రి హరీశ్‌రావు



సంగారెడ్డిలో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు పక్కన చింతా ప్రభాకర్

సంగారెడ్డి/జహీరాబాద్ టౌన్: వచ్చే ఎన్నికల్లో జగ్గారెడ్డి కావాలో అందరివాడుగా పేరొంది నిత్యం అందుబాటులో ఉంటున్న చింతా ప్రభాకర్ కావాలో నియోజకవర్గ ప్రజలు తెల్చుకోవాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి, జహీరాబాద్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఎన్నికల బూత్ కమిటీల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. గతంలో మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న జగ్గారెడ్డి గెలిచిన తర్వాత ఐదేళ్లలో ఐదు సార్లు అయినా సంగారెడ్డికి రాకుండా ముఖం చాటేశారన్నారు. ఎన్నికల హామీల్లో గల్లికో ఏటీఎం, ఇంటికో ఉద్యోగం, ఇంటి స్థలం అని చెప్పి ఇంతవరకు కనిపించకుండా పోయారన్నారు. తిరిగి డ్రామాలు చేయడానికి కల్లబొల్లి మాటలతో వస్తాడు! జాగ్రత్తగా ఉండాలని హితవుపలికారు. ముఖ్యనాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు అందరూ మౌనం వీడి, మొహమాటం పక్కన పెట్టి రంగంలో దిగితే జగ్గారెడ్డి గాల్లో కలిసి పోతారన్నారు. ఇటీవల పట్టణంలో జరిగిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే బహిరంగ సభలో ఉన్న దాని కంటే ఎక్కువ మంది కేవలం ముఖ్యకార్యకర్తల ఈ మీటింగ్‌లోనే ఉన్నారని వెల్లడించారు. తెలంగాణ ద్రోహిగా ముద్ర వేసుకున్న జగ్గారెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. తెలంగాణ వస్తే సంగారెడ్డిని కర్ణాటకలో కలపాలని చెప్పిన ఆయనకు సంగారెడ్డి ప్రజల ఓట్లు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. కేసీఆర్ లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా.. రేవంత్ లాంటి రాంగ్ లీడర్‌లకు మద్దతు ఇవ్వొదని ఉద్ఘాటించారు. మూడోసారి సైతం కేసీఆర్ సీఎం అవుతారన్నారు. సంగారెడ్డిలో చింతా ప్రభాకర్ సైతం 50 వేల మెజార్టీతో గెలుపొందడం ఖాయమని జోస్యం చెప్పారు.

నాయకులు బాగా పని చేయాలి

ఈసారి కార్యకర్తలు, నాయకులు బాగా పని చేసి చింతా ప్రభాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించినట్లయితే సంగారెడ్డిని మరింత అభివృద్ధి చేస్తానని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఆయనకు అనారోగ్యంగా ఉన్న విశ్రాంతి లేకుండా ప్రజల కోసం అహర్నిశలు పనిచేసిన మంచి నాయకుడన్నారు. కాంగ్రెస్ చెప్పే మాయమాటలను నమ్మి మోసపోతే గోసపడేది ప్రజలేనన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. బీజేపీ డకౌటయితే కాంగ్రెస్ ఇట్ వికెట్‌గా నిలిచిపోతుందని చెప్పారు. సంగారెడ్డికి రూ.570 కోట్లతో మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల తీసుకువచ్చామని స్పష్టం చేశారు. రూ.70 కోట్లతో సంగారెడ్డిని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. అనంతరం చింతా ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రజలే నా బలం నా బలగం అన్నారు. తామే అభ్యర్థిగా భావించి తనను గెలిపించాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం తథ్యం

మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పార్టీకి 75 పైగా సీట్లు వస్తాయని, అన్నీ సర్వేలు చెబుతున్నాయన్నారు. జిల్లాలో ఉన్న పదికి పది సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. అవి గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంట్ కట్ అవుతుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే 5 గంటల కరెంట్ ఇస్తామని ఇటీవల తాండూర్ సభలో కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చెప్పారని, తెలంగాణలో 24 గంటల సరఫరా ఉందన్న విషయాన్ని ఆయన తెలుసుకోవాలన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. రైతు బంధు బంద్ చేయాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. ఉస్మానియా వర్శిటీ విద్యార్థులు అడ్డా కూలీలని, బీరుబిర్యానీలకు అమ్ముడుపోతారని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అవమానపరిచారన్నారు. ఆ పార్టీ నాయకులకు ఎంత గర్వమో ప్రజలు ఆలోచించాలన్నారు. సమావేశాల్లో ఎంపీ.బీబీపాటిల్, టీఎస్ ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ పట్నం మాణిక్యం, డీఎస్వీవో మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, నాయకులు డాక్టర్ శ్రీహరి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, విజేందర్‌రెడ్డి వెంకటేశ్వర్లు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్, టీఎస్ఐడీసీ చైర్మన్ తన్వీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం, పార్టీ నియోజకవర్గం కోఆర్డినేటర్ దేవిప్రసాద్, నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మాణిక్‌రావు లోకల్.. మిగతా పార్టీల అభ్యర్థులు నాన్‌లోకల్

జహీరాబాద్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు ఒక్కరే పక్కా లోకలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల అభ్యర్థులు నాన్‌లోకల్ అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌ను వికారాబాద్ ప్రజలు వరుసగా ఓడిస్తే ఇక్కడికి వచ్చాయన్నారు. ఊసరవెల్లిలా పార్టీలు మారుతున్నారని, మొన్నటి వరకు బీజేపీలో ఉండి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో అతను పార్టీ మారడన్న గ్యారంటీ లేదన్నారు. జహీరాబాద్ ఆత్మగౌరవానికి పరీక్షా సమయమన్నారు. నిత్యం ప్రజల మధ్యలో ఉండే మాణిక్‌రావును గెలిపించుకోవాల్సిన బాధ్యత బూత్ కమిటీలపై ఉందన్నారు. తాను మాణిక్‌రావు ఒక్కటేనన్నారు. ఇద్దరం సైతం నియోజకవర్గానికి సేవ చేస్తామన్నారు. ఎవరికైన ఆపద ఉంటే తన ఇంటి తలుపు కొట్టండని, 24 గంటలపాటు అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే సంగమేశ్వర ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకీ సాగు నీటి అందిస్తామన్నారు. సింగూర్‌లో పనులు ప్రారంభమయ్యాయని, రెండు సంవత్సరాల్లో జహీరాబాద్ సస్యశ్యామలం కానుందన్నారు.



జహీరాబాద్‌లో ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు పక్కన మాణిక్‌రావు

ఐదు నామినేషన్లు

- తొలి రోజు సంగారెడ్డికి ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు...
- అందోల్, పటాన్‌చెరులో ఒక్కొక్కరు

సంగారెడ్డి : నామినేషన్ల పర్వం మొదలైంది. తొలి రోజైన శుక్రవారం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తంగా ఐదుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో నలుగురు స్వతంత్రులు ఉన్నారు. సంగారెడ్డి స్థానానికి తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థిగా దొడ్ల వెంకటేషం నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా పట్లోల్ల సంతోష్ రెడ్డి, తుమ్మలపల్లి పృథ్వీరాజ్ నామినేషన్ వేశారు. వీరి నుంచి సంగారెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డి పత్రాలను స్వీకరించారు. అందోల్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా గైని కృష్ణ, పటాన్‌చెరు స్థానానికి స్వతంత్ర్య అభ్యర్థిగా టి.శ్రీకాంత్ నామినేషన్ దాఖలు చేశారు. నారాయణఖేడ్, జహీరాబాద్‌లో ఎలాంటి నామినేషన్లు రాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు.



సంగారెడ్డి : నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి పృథ్వీరాజ్



పటాన్‌చెరు టౌన్: నామినేషన్ పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్



జోగిపేట(అందోల్) రిటర్నింగ్ అధికారి పాండుకు పత్రాలను అందజేస్తున్న కృష్ణ

ఢిల్లీ వసంత్ నిరసన

ఝరాసంగం(జహీరాబాద్): బీజేపీ గురువారం విడుదల చేసిన జాబితాలో తనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించక పోవడాన్ని నిరసిస్తూ ఢిల్లీ వసంత్ కుమార్ నిరసన తెలిపారు. శుక్రవారం ఆయన ఎల్గోయి గ్రామ శివారులో ఉన్న చెరకు రైతు సీహెచ్ దశరథ్ సమాధి వద్దకు చేరుకుని నిద్రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను రాజకీయంగా ఎదగనివ్వడం లేదని వివిధ పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా 2007లో చెరుకు రైతు సమస్యలపై కలత చెంది దశరథ్ ఆత్మహత్య చేసుకోవడం తెలిసిందే.



సమాధి వద్ద నిరసన తెలుపుతున్న వసంత్

రోహిత్ ప్రచారాన్ని అడ్డుకునే యత్నం

దళితవాడలో కాంగ్రెస్, బీఆర్ఎర్ వర్గాల వాగ్వాదం

రామాయంపేట/నిజాంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్ రామాయంపేట దళితవాడలో ప్రచారం చేస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుకు బైక్‌లు అడ్డం పెట్టారు. ఆపై అడ్డుకునే యత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాట చోటుచేసుకోగా ఈ గ్రూపుల నేతలు ఒకరినొకరు వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రోహిత్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తనను అడ్డుకోవడం దారుణమన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టినందుకా? తనను అడ్డుకుంటుంది అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆ పార్టీ నేతలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మెదక్‌లో జరిగిన అభివృద్ధి విషయమై తాను బహిరంగ చర్చ సిద్ధమని సవాల్ చేశారు. తన ప్రచారాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న రోహిత్

■ శివుడి కటాక్షం ఉండాలప్పా..



శివయోగి ఆశీస్సులు తీసుకుంటున్న సంగప్ప

వట్‌పల్లి(అందోల్): నారాయణఖేడ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సంగప్పను ప్రకటించారు. శుక్రవారం మండల పరిధిలోని దుద్యాల సర్వేశ్వరపూరీ క్షేత్రంలో ఆయన పూజలు చేశారు సర్వేశ్వరపూరి క్షత్ర పీఠాధిపతి అంబికా శివయోగి మహరాజ్ ఆశీస్సులు తీసుకునేందుకు ఇక్కడి వచ్చినట్లు తెలిపారు. ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్లి ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి, అరాచకాలు పెరిగిపోవడంతో ప్రజలు కేసీఆర్ పాలనపై విసుగు చెందుతున్నారన్నారు.

■ పూజ ఫలప్రదమవ్వాలి



దత్తగిరిలో పూజలు చేస్తున్న రాంచందర్

ఝరాసంగం(జహీరాబాద్): బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో బీజేపీ జహీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి రాంచందర్ పూజలు చేశారు. అధిష్టానం టికెట్ కేటాయించగా.. శుక్రవారం మండల పరిధిలోని బర్దీపూర్ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు.

■ ఓటును వడసి పడదాం

జిన్నారం(పటాన్‌చెరు): ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రచారాల్లో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. జిన్నారం మండలం గుమ్మడిదలలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి మద్దతుగా మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఒక హోటల్‌లో వడ తయారు చేశారు.



హోటల్‌లో వడలు తయారు చేస్తున్న సురేందర్‌రెడ్డి తదితరులు

■ ధీఎస్పీ అభ్యర్థి సైతం..



బీఫామ్ అందుకుంటున్న జీవన్

నారాయణఖేడ్: నియోజకవర్గ ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) అభ్యర్థి అతిగే జీవన్ బీఫామ్ అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారధన్ మహారాజ్ అందజేశారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరగాలంటే డీఎస్పీ అధికారంలోకి రావాల్సి ఉందని అన్నారు.

బారికేడ్ల బహూకరణ

హత్నూర (సంగారెడ్డి): 20 బారికేడ్‌లు బహూకరించడం అభినందనీయమని జిన్నారం సీఐ వేణు కుమార్ అన్నారు. శుక్రవారం మండలం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద దౌల్తాబాద్ శివరాం ట్రేడర్స్ అందజేసింది. కార్యక్రమంలో ఎస్సై సుభాష్, సర్పంచ్ వెంకటేశం, నాయకులు సతీష్, రాములు పాల్గొన్నారు.



దౌల్తాబాద్ లో ఏర్పాటు చేసిన బారికేడ్లు

నిబంధనల ప్రకారం విధులు

అధికారులకు వ్యయ పరిశీలకులు జయకర్, విజయ్ కృష్ణవెలాన్ సూచన

సంగారెడ్డి టౌన్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని వ్యయ పరిశీలకులు కేపీ జయకర్, కే విజయ్ కృష్ణ వెలాన్ సూచించారు. శుక్రవారం జిల్లాకు చేరుకున్న వారు కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. కలెక్టర్ శరత్, ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్లు, ఆయా నోడల్ అధికారులు, సహాయ వ్యయపరిశీలకులు, అకౌంటింగ్ టీంతో కలిసి సమావేశమయ్యారు. ఎన్నికలు పారదర్శకంగా శాంతియుత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఆయా అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముందుగా డాక్టర్ శరత్ పీపీటీ ద్వారా జిల్లాలో గల మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓటర్ల సంఖ్య, ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు తదితర వివరాలను వివరించారు. ఎస్పీ రూపేష్ సైతం.. ఎన్నికలకు అవసరమైన పోలీస్ ఫోర్స్, బందోబస్తు, జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల తదితర వివరాలను వివరించారు. అనంతరం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ), సోషల్ మీడియా, ఎంసీసీ, ఈఈఎంసీ, సి-విజిల్, జిల్లా గ్రీవెన్స్ విభాగాన్ని ఎన్నికల పరిశీలకులు పరిశీలించారు. ఎంసీఎంసీ, సోషల్ మీడియా, ఇతర కేంద్రంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న వ్యయపరిశీలకులు

నామినేషన్ కేంద్రాల సందర్శన

కాగా, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలను కలెక్టర్ శరత్ సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యర్థులు సమర్పించే పత్రాలను తప్పులు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా సరి చూసుకోవాలని తెలిపారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదు

పటాన్‌చెరు టౌన్ : స్థానిక నియోజకవర్గ నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ శరత్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. అధికారులకు కలెక్టర్ నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏమైనా నామినేషన్లు వచ్చాయా? అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజాను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రం వద్ద ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎస్పీ పురుషోత్తం రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో సీఐ లాలూనాయక్, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి ఉన్నారు.



బీడీలు చుడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు

బీడీలు చుడుతూ.. పథకాలను వివరిస్తూ..

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. బీఆర్‌ఎస్ దుబ్బాక అభ్యర్థి , ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీలు చుడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సులోచన, మీన, కల్పన, యాదమ్మ, రజిత బీఆర్‌ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శాలిపేట హోటల్‌లో టీ తాగుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

ప్రచారం.. కాసేపు విరామం

చిన్నశంకరంపేట(మెదక్): పేట మండలం ఖాజాపూర్‌తండా, ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి, మడూర్ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార సమయంలో కాసేపు శాలిపేటలోని ఓ హోటల్ టీ తాగారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



పత్తి చేనులో ప్రచారం చేస్తున్న నాయకులు

పత్తి చేనులో ప్రచారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో పార్టీ నాయకులు పత్తి ఏరుతున్న కూలీల దగ్గరకు వెళ్లి అక్కా బాగున్నారా.. అవ్వా మంచిగున్నారా అంటూ ఆత్మీయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. కారు.. సర్కారు..కేసీఆర్‌కు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.




వర్గల్ మండలం మైలారంలో డప్పు కొడుతున్న వంటేరు

డప్పుకొట్టి.. దరువేసి

వర్గల్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వర్గల్ మండలం మైలారంలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వచ్చారు. ఇనుమడించిన ఉత్సాహంతో ర్యాలీలో చేరిపోయి డప్పుకొట్టి దరువేశారు. కార్యకర్తల్లో నూతనోత్సాహం కలిగించారు.

అందోల్ కోటలో గెలుపెవరిది..?

- తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, రెండు సార్లు బీఆర్‌ఎస్
- హ్యాట్రిక్ కోసం అధికార పార్టీ గురి
- పదో విజయంపై కాంగ్రెస్ కన్ను
- తీవ్రంగా శ్రమిస్తున్న ప్రధాన పార్టీలు



వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర రాజకీయాల్లో 'అందోలు' నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన మెజార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రుల య్యారు. 1952లో అందోల్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరిగితే రెండు సార్లు మాత్రమే స్థానిక ఎమ్మెల్యేలు గెలుపొందగా, మిగితా వాటిలో స్థానికేతరులు గెలుపొందారు.

మొత్తంగా తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, బీఆర్‌ఎస్ రెండు సార్లు, ఒకసారి ఇండిపెండింట్ గెలుపొందాయి.

1952 నుంచి 1967 వరకు జనరల్ క్యాటగిరీ ఉండగా, 1967 నుంచి అందోల్ నియోజకవర్గాన్ని ఎస్సీలకు రిజర్వు చేశారు. రిజర్వుడు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత 12 సార్లు జరిగిన ఎన్నికల్లో రాజనర్సింహ కుటుంబ సభ్యులే ఆరుసార్లు ఎన్నికయ్యారు. 1985, 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి మల్యాల రాజయ్య గెలుపొందగా ఆర్థిక, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖలను నిర్వహించాడు. బాబూ మోహన్ 1998 ఉప ఎన్నిక , 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొంది కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014 ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

1989, 2004, 2009 ఎన్నికల్లో దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి మూడుసార్లు గెలుపొంది. మార్కెట్, వ్యవసాయ, విద్య, ఉప ముఖ్యమంత్రి పదవులను పొందాడు. అలాగే, ఓపెన్ కేటగిరి సమయంలో జోగిపేటకు చెందిన వ్యక్తి వైశ్యుడైన బస్వ మాణయ్య స్థానిక మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆ తర్వాత 14 సార్లు ఎన్నికలు జరుగగా స్థానికేతరులే గెలుపొందారు. 1967లో రిజర్వుడు తర్వాత స్థానికులకు పోటీ చేసేందుకు అవకాశాలు లభించలేదు. 2018 ఎన్నికల నాటికి స్థానిక నినాదం బలపడింది. దీంతో ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడాకు చెందిన చంటి క్రాంతికిరణ్ విజయం సాధించడంతో రెండోసారి ఎమ్మెల్యే వ్యక్తి గెలిచారు.

నియోజకవర్గంలోని ఓటర్లు

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
అందోలు	22,438	23,670	46,109
అల్లాదుర్గం	11,371	11,933	23,304
రేగోడ్	9,082	9,292	18,374
టేక్మాల్	13,725	14,724	28,450
పుల్కల్	10,937	11,389	22,326
రాయికోడ్	16,136	15,650	31,787
మునిపల్లి	16,371	16,495	32,866
వట్‌పల్లి	12,452	12,602	25,055
చౌటకూర్	8,382	8755	17,138

అందోలు ఎమ్మెల్యేలు

1952	వెంకట రాజేశ్వర జ్యోషి	(కాంగ్రెస్)
1957	బస్వ మాణయ్య	(స్వతంత్ర)
1962	ఎస్.లక్ష్మిదేవి	(కాంగ్రెస్)
1967	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1972	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1978	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1983	హెచ్.లక్ష్మణ్ జీ	(కాంగ్రెస్)
1985	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1989	దామోదర్	(కాంగ్రెస్)
1994	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1998	పి.బాబుమోహన్	(టీడీపీ)
1999	పి.బాబుమోహన్	(టీడీపీ)
2004	దామోదర	(కాంగ్రెస్)
2009	దామోదర	(కాంగ్రెస్)
2014	బాబుమోహన్	(టీఆర్ఎస్)
2018	చంటి క్రాంతికిరణ్	(టీఆర్ఎస్)

జంగ్ తెలంగాణ

ఆ ఆరుగురి చుట్టే నర్సాపూర్





గుండం వీరయ్య



విఠల్‌రెడ్డి



జగన్నాథరావు



సునీతారెడ్డి



మదన్‌రెడ్డి

- ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు
- విఠల్‌రెడ్డి ఐదు, జగన్నాథరావు మూడుసార్లు విజయం
- గుండం వీరయ్య, జయరాంరెడ్డి ఒక్కోసారి..
- మదన్‌రెడ్డి రెండు, సునీతారెడ్డి మూడుసార్లు గెలుపు

నర్సాపూర్: నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 15 సార్లు శాసనసభ ఎన్నికలు జరుగగా ఆరుగురు వ్యక్తుల చుట్టే విజయం తిరిగింది. 1952 నుంచి జరిగిన పలు ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జయరాంరెడ్డి, గుండం వీరయ్య, చిలుముల విఠల్‌రెడ్డి, చౌటి జగన్నాథరావు మృతిచెందారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా చిలుముల మదన్‌రెడ్డి కొనసాగుతుండగా ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ పడుతున్నారు.

1952లో మొదటిసారి ఎన్నికలు

1952 సంవత్సరంలో మొదటిసారి నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ నుంచి జయరాంరెడ్డి పోటీ చేసి సోషలిస్టు కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన భగవాన్‌దాస్‌పై విజయం సాధించారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుండం వీరయ్య పోటీ చేసి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. 1962లో చిలుముల విఠల్‌రెడ్డి సీపీఐ నుంచి మొదటిసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావుపై గెలుపొందారు. 1967, 1972 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చౌటి జగన్నాథరావు వరుసగా రెండు సార్లు గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థి చౌటిజగన్నాథరావుపై సీపీఐ అభ్యర్థి విఠల్‌రెడ్డి గెలుపొందగా, 1983లో సీపీఐ అభ్యర్థి చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావు గెలుపొందారు.

హ్యాట్రిక్ సాధించిన విఠల్‌రెడ్డి

1985, 1989, 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి జగన్నాథరావుపై సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డి వరుసగా మూడుసార్లు గెలుపొంది నర్సాపూర్ ఎమ్మెల్యేగా మొదటిసారి హ్యాట్రిక్ సాధించారు. అలాగే, 1999లో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వాకిటి సునీతారెడ్డి రెండు రికార్డులు సాధించారు. 1999 ఎన్నికల్లో గెలుపొంది నర్సాపూర్ నుంచి గెలుపొందిన మొదటి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు పొందారు. అంతేగాక నర్సాపూర్ ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు (1999, 2004, 2009) గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

రెండు సార్లు మదన్‌రెడ్డి

1999, 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మదన్‌రెడ్డి రెండు సార్లు ఓటమి చవిచూడగా ప్రత్యేక రాష్ట్రంలో రెండుసార్లు వరుసగా గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల మదన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి (హ్యాట్రిక్ ఎమ్మెల్యే) సునీతారెడ్డిపై గెలుపొందారు. 2018లో సైతం సునీతారెడ్డిపై రెండోసారి విజయం సాధించారు.

మీ ఓటు మా ఆయనకే..



ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్ భార్య ప్రమీల



ప్రచారం చేస్తున్న రాజమణి మురళీయాదవ్

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎ.చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన భార్య ప్రమీల శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజలతో మాట్లాడారు. పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె వెంట మాజీ కౌన్సిలర్లు కండెం సుజాత, తాహెరాబేగం నాయకులు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ నియోజకవర్గంలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూరలో బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు మద్దతుగా ఆయన సతీమణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్, నాయకులు నీరుడి అశోక్, సతీష్ యాదవ్, రవి, సుధాకర్, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం' వచ్చాయా?



గ్యారంటీ పథకాలను వివరిస్తున్న పొన్నం

- హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ పథకం ఇళ్లలో అల్లుడు వస్తే ఏడ ఉంటాడు.. అని చెప్పిన సీఎం కేసీఆర్ మీ ఊరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చాడా? అని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రజలను అడిగారు. అక్కన్నపేట మండలంలోని మంచి నీళ్లబండ, కేశవాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి, మోత్కులపల్లి, పెద్దతండా గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాకతీయ యూనివర్సిటీ రిటైర్ ప్రొఫెసర్ వీరన్ననాయక్, అక్కన్నపేట గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బూత్‌లో 1,400 మంది ఓటర్లే

నారాయణఖేడ్: ఎన్నికల నిర్వహణలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా అధికారులు చూస్తారు. ఈ సంఖ్యను ఎందుకు పరిమితం చేశారంటే.. ఈవీఎంలకు అనుసంధానించి ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1,500 స్లిప్పులను మాత్రమే ప్రింట్ చేస్తుంది. 22.5 ఓల్ట్‌ల బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటు ఎవరికి వేసిందనేది డిస్‌ప్లేలో కనిపిస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్పులు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియ కోసం ఖర్చవుతాయి. అందుకే ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,400మంది లోపు వరకు మాత్రమే ఓటర్లు ఉండేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.

నాయకులుంటే సరిపోతుందా..?

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



ప్రచారంలో కనిపించని ప్రజలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికిలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కానీ, ప్రజలు ఎక్కువగా లేకపోవడంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన నాయకులతోపాటు కొంత మంది స్థానికులు మాత్రమే ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, ఉపసర్పంచ్ ఇతర నాయకులు ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారం గురించి ప్రజలకు చెప్పలేదా అని ప్రశ్నించారు. నాయకులు ఉంటే సరిపోదని ప్రజలు ఉండాలన్నారు. ఓటర్లు అంతా కారు గుర్తుకే ఓటు వేసేలా చూడాలన్నారు.

రూ.28.50 లక్షలు స్వాధీనం



నగదు చూపుతున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ రహదారిపై శుక్రవారం ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.28.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట నుంచి వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మానకొండూర్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, పీసీలు బాలరాజు, రవి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తుడిని పీసీసీ అధ్యక్షుడిగా నియామకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

రామాయంపేట(మెదక్): ఒక ఆర్థిక నేరస్తుడిగా ముద్రపడ్డ , ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ వ్యక్తిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మోసకారి కేసీఆర్‌కు బుద్ధి చెప్పండి

జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి



కడవేర్గులో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి, నమ్మక ద్రోహం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడవేర్గు, పోతిరెడ్డి పల్లె, పెద్దరాజుపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలన్నారు. ఈ ప్రాంత రైతుల కష్టాలు తీర్చేందుకు నిర్మించిన తపాసుపల్లి డ్యాం నుంచి నీటిని సిద్దిపేటకు తరలించేందుకు ఒప్పుకోనందుకే తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేశాడన్నారు. ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే తపాస్‌పల్లి డ్యాం నుంచి సిద్దిపేటకు నీటిని తరలించే కాల్వలను మీ అందరి సహకారంతో, మీ సమక్షంలోనే కూల్చివేస్తానన్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ నర్సింగరావు, నాయకులు పరమేశ్వర్, భాస్కర్‌రెడ్డి, ఆగంరెడ్డి, యాదగిరి, రాకేశ్ కృష్ణ, లాల్‌మహ్మద్, సంతోష్, శ్రీకాంత్, సన్నీ, విజయ్, శ్రీనివాస్, మల్లేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లాను భారీ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పల్లా సతీమణి నీలిమ

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే చేర్యాల ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 7,8,9,10 వార్డుల్లో పల్లాకు మద్దతుగా ఆయన సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్‌లు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే చేర్యాల ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్ గౌడ్, జుబేదా ఖతూన్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, పార్టీ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, కోతి విజయ్, మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య, నాయకులు తాడెం రంజిత, మేడిశెట్టి ఉమ, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, బుడిగె గురువయ్య, నాగమల్ల శ్రీనివాస్, యాట భిక్షపతి, రావుల ఉమేశ్, పచ్చిమడ్ల సిద్దిరాములు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని



మెదక్ మున్సిపాలిటీ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే నడిపిన వారిపై, ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 2022 సంవత్సరంలో పలు విభాగాలకు సంబంధించి కేసుల వివరాలు వెల్లడించారు. సీటు బెల్టు పెట్టుకోనివి-8,200, సెల్‌ఫోన్ డ్రైవింగ్-1,943, హెల్మెట్ లేకుండా - 32,099, డ్రంకెన్‌డ్రైవ్ - 8,642, ఓవర్ స్పీడ్ - 75,403, చిన్న డ్రైవింగ్ కేసులు - 2,460, ట్రిపుల్ రైడింగ్ - 10,346 ఓవర్ లోడింగ్-359 కేసులు నమోదైనట్లు తెలిపారు. అలాగే, 2022లో మొత్తం ప్రమాదాల సంఖ్య - 522 కాగా, 263 మంది చనిపోయినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో కూడా మార్పు రావాలని కోరారు.